
సాక్షి
ఒడిశా

సోమవారం ı 12 ı మే ı 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,81,126లు, బంగారం 1గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 20 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

దేవాలయాల్లో పూజలు



నబరంగ్‌పూర్‌లో హైకోర్టు న్యాయమూర్తులు పూజలు చేశారు. అది వారి స్వస్థలం.

- 8లో



బీజేపీని పటిష్టం చేయాలి

రాయగడలో బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

ఉపశమనం



ఏజీ స్క్వేర్ వద్ద శాశ్వత ఛాయా ప్రాంగణం

భువనేశ్వర్: వేసవి వేడిమి నుంచి నడి రోడ్డు మీద మోటారు వాహన చోదకులకు ఉపశమనం కల్పించారు. స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ ఈ మేరకు చర్యలు చేపట్టింది. రాత్రింబవళ్లు వాహనాల రద్దీతో నిత్యం కిటకిటలాడే స్థానిక ఏజీ స్క్వేర్ వద్ద నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన శాశ్వత ఛాయా సదుపాయం ట్రాఫిక్‌లో వేచి ఉన్న వాహనదారులకు ఊరట కలిగించే ఉపశమనాన్ని అందిస్తుంది. ఇది వేసవిలో, వర్షాకాలంలో రెండింటికీ సహాయపడుతుందని సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.

శ్రీనివాసరావుకు తెలుగు భాషా పురస్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం వాసి కవి, పాత్రికేయులు సింహాద్రి శ్రీనివాస రావుని ఏలూరులో ఈ నెల 10, 11వ తేదీల్లో శ్రీశ్రీ కళా వేదిక నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరు శ్రీలక్ష్మీ గోపాల స్వామి కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో శ్రీనివాస రావుని శ్రీశ్రీ కళా వేదిక నిర్వాహకులు డాక్టర్ కత్తి మండప్రసాద్, డాక్టర్ టి.పార్థసారధి, కొల్లి రమాదేవి, ఈశ్వరీ భూషణం ఘనంగా సత్కరించారు. శ్రీనివాసరావుకు అరుదైన తెలుగు భాషా పురస్కారం లభించినందుకు జయపురం తెలుగు భాషాభిమానులు, సాహితీ ప్రియులు అభినందనలు తెలిపారు.

లక్ష్మీ నృసింహునికి విశేష పూజలు



ప్రత్యేక సేవ చేస్తున్న అర్చకులు

రాయగడ: కొలనార సమితి పరిధిలోని అమలాభట్ట వద్ద గల శ్రీక్షేత్ర టౌన్ షిప్‌లో పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీనృసింహుని ఆలయంలో లక్ష్మీనృసింహుని జయంతోత్సవాలను పురస్కరించుకుని విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చనతోపాటు స్వామి వారికి సేవా కార్యక్రమాలు చేశారు. అధికమంది భక్తులు తరలిరావడంతో మందిరం కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్ దంపతులు ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలను చేశారు.

అలంకార స్వరూపుడు..



రాసమండలి అలంకరణలో మదన మోహనుడు

భువనేశ్వర్: పవిత్ర వైశాఖ శుక్ల పక్ష త్రయోదశి పురస్కరించుకుని మదన మోహనుడు రాస మండలి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. వెలుపలి చందన యాత్ర పురస్కరించుకుని శ్రీ జగన్నాథుని ప్రతినిధిగా నిత్యం నరేంద్ర సరోవరంలో నావికా విహారం చేస్తున్నాడు. 12వ రోజు చందన యాత్రలో భాగంగా నరేంద్ర పుష్కరిణి మండపంపై ఈ అలంకరణలో స్వామి ప్రత్యక్షమయ్యాడు.

సాయుధ దళాలకు.. మద్దతు ఇవ్వాలి

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు



రాజ్ భవన్‌లో సర్వ ధర్మ సమావేశంలో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



రాజ్ భవన్‌లో సర్వ ధర్మ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

భువనేశ్వర్: ఉగ్రవాదానికి మతం లేదు, హింసకు గ్రంథం లేదని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి స్థానిక రాజ్ భవన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో అన్నారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మత సంస్థ అధిపతులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరయ్యారు. 26 మంది ప్రాణాలను బలిగొన్న దాడిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ డాక్టర్ కంభంపాటి ఇది అమాయక పౌరులపై జరిగిన దాడి మాత్రమే కాదు, భారత దేశం అనే భావనపై – మన ఐక్యత, ప్రజాస్వామ్యం, శాంతిపై – దాడి అని అన్నారు. సరిహద్దు వెంబడి ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని కచ్చితమైన దాడులతో కూడిన ఆపరేషన్ సిందూర్‌ను సాయుధ దళాలు ప్రారంభించాయని అయన సభకు తెలియజేశారు. మన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి మన ధైర్యవంతులైన సైనికులు మరోసారి ముందంజ వేశారని పేర్కొన్నారు. ఈ కీలక సమయంలో మనం వారి వెనుక దృఢంగా నిలబడాలని రాష్ట్ర గవర్నర్ కోరారు. మరణించిన వారి కోసం, గాయపడిన వారి కోసం ప్రార్థనలు చేయాలని ఆయన మత సంస్థలకు పిలుపునిచ్చారు. సంఘీభావ ప్రదర్శనలో జాతీయ జెండాను ఎగురవేయాలని విద్యా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. సమావేశం ఒక శక్తివంతమైన సందేశాన్ని పంపుతుందని, విశ్వాసం, భాష, ఆచారాలలో వైవిధ్యం ఉన్నప్పటికీ మన దేశాన్ని, దాని విలువలను రక్షించుకునే విషయంలో మనం ఐక్యంగా ఉన్నామని ఆయన అన్నారు. డాక్టర్ హరిబాబు కంభంపాటి పౌరులు, సైనికులు సహా బాధితుల కుటుంబాలకు హృదయపూర్వక సంతాపం తెలిపారు. గాయపడిన సైనికులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. భారత దేశం ఎప్పటికీ ఉగ్రవాదానికి తలవంచదని ప్రపంచానికి సందేశం పంపుదామన్నారు. మన ఐక్యత, మనల్ని రక్షించే వారికి అచంచలమైన మద్దతు మన బలం అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఉగ్రవాదం మానవాళిపై యుద్ధం అని తెలిపారు. దేశానికి అవసరమైనప్పుడల్లా అన్ని సమాజాలు ఎలా కలిసి వస్తాయో చరిత్ర చూపిస్తుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ హమీద్ ధైర్యం, త్యాగాన్ని ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. మన గొప్ప గుర్తింపు భారతీయులుగా ఉండటం, కులం, మతం లేదా మత సంబంధాలకు అతీతంగా మనమందరం భారతీయులమని ఆయన అన్నారు. ఈ సర్వ ధర్మ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత సాహు, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ వై. బి. ఖురానియా మరియు సీనియర్ రక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

దైతపతి సేవకుడు రామకృష్ణ దాస్ మహాపాత్రో సస్పెన్షన్

- 30 రోజులు శ్రీ మందిరంలోనికి ప్రవేశం నిషిద్ధం

భువనేశ్వర్: శ్రీ మందిరం సంస్కృతి, ఆచారాలకు భంగం కలిగించిన అపచారానికి సీనియర్ దైతపతి సేవకుడు రామకృష్ణ దాస్ మహాపాత్రోపై సస్పెన్షన్ వేటు పడింది. వివాదాస్పద పశ్చిమ బెంగాల్ దిఘా శ్రీ జగన్నాథ ఆలయం ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనడం పలు సంచలనాత్మక పరిస్థితుల్ని ప్రేరేపించింది. ఈ నేపథ్యంలో శ్రీమందిర్ ముఖ్య నిర్వాహకుడు డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి దైతపతి వ్యతిరేకంగా క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం జారీ అయిన ఈ ఆదేశాల ప్రకారం 30 రోజులు భగవంతుని సేవ చేయకుండా సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్ కాలంలో రామకృష్ణ దాస్ మహాపాత్రో ఏ సేవలోనూ పాల్గొనడానికి లేదా ఆలయంలోకి ప్రవేశించడానికి వీలులేదని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. శ్రీ మందిరం సీఏవో జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వుల అమలు నిడివిలో నిందిత దైతపతి సేవకుడు శ్రీ మందిరంలో ఇతర సేవకుల లేదా వేరే ఇతర వ్యక్తులు నిర్వహించే దైనందిన ఆలయ సేవ, పూజ తదితర కార్యకలాపాల్లో ఆటంకం కలిగించేలా ప్రలోభపెట్టినా బెదిరించినా సస్పెన్షన్ వ్యవధి పొడిగించి మరింత కఠినమైన క్రమశిక్షణా చర్యలు చేపట్టాల్సి వస్తుందన్నారు. సస్పెన్షన్ వ్యవధిలో ఆలయ కమాండర్, సీనియర్ సూపర్‌వైజర్ నిందిత దైతపతి ప్రవర్తనపై ఆలయ ప్రధాన నిర్వాహకుడికి క్రమం తప్పకుండా తాజా కదలికల్ని నివేదిస్తారని ఉత్తర్వుల్లో వివరించారు. సస్పెన్షన్ సమయంలో క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడితే శ్రీ మందిరం చెల్లించాల్సిన భత్యాలు, పారితోషికం, బహుమానాలను రద్దు చేస్తామని తెలియజేశారు. ఈ చర్య తీసుకునే ముందు సీనియర్ దైతపతి సేవకుడు రామకృష్ణ దాస్‌మహాపాత్రోకు శ్రీ జగన్నాథ ఆలయ పాలక వర్గం 2 తాఖీదులు జారీ చేసింది. తొలి తాఖీదు వివరణ దాఖలు కోసం 7 రోజులు మలి తాఖీదు నేపథ్యంలో సంతృప్తికర వివరణ కోసం 2 రోజుల గడువు మంజూరు చేసిన విషయం తెలిసిందే. దిఘా ఆలయంలో నవ కళేబరం మిగులు దారు (వేప చెక్క)తో తయారు చేసిన విగ్రహాన్ని ప్రతిష్ఠించారని ప్రచారం చేసి ప్రపంచ వ్యాప్తంగా అగణిత జగన్నాథ భక్తుల మత విశ్వాసాన్ని అవమానపరిచిన బాధ్యతారహిత ప్రకటనలతో శ్రీ మందిరం గౌరవ ప్రతిష్ఠల్ని దిగజార్చిన విచారకర పరిస్థితులపై తొలి తాఖీదులో వివరణ కోరారు. ఈ నెల 9న జారీ చేసిన రెండో తాఖీదులో పశ్చిమ బెంగాలు దిఘా ప్రాంతంలో శ్రీ జగన్నాథ ఆలయానికి జగన్నాథ్ ధామ్ నామకరణంతో వివాదాస్పదం కాగా ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన ఎందుకు పాల్గొన్నారని వివరణ కోసం నిలదీశారు. ఈ సందర్భంగా శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు మాట్లాడుతూ ఆలయ ఆచార వ్యవహారాలకు కట్టుబడి క్రమశిక్షణపూరిత వాతావరణంలో దేవస్థానం ప్రశాంతంగా ఉంచేందుకు ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. ఆలయ ఆచార సంప్రదాయాలు, గౌరవ ప్రతిష్ఠలు చెక్కుచెదరకుండా పరిరక్షించుకునేందుకు అహంకారం, దురుసు చర్యల్ని తిరస్కరించడం మనందరి కర్తవ్యంగా పేర్కొన్నారు. ఇది జగన్నాథుడిపై మనకున్న భక్తికి నిదర్శనం కావాలని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఎలాంటి దుగ్ధతలను సహించబోమని ఆలయ ప్రధాన నిర్వాహకుడు డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి స్పష్టం చేశారు.

ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని డిమాండ్



నినాదాలు చేస్తున్న దళిత, మైనారిటీ సంఘాల ప్రతినిధులు

కొరాపుట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలనే డిమాండ్‌ను అవిభక్త కొరాపుట్ జిల్లాలో పేద, బలహీన, బడుగు, గిరిజనులు తెరపైకి తీసుకువచ్చారు. ఆదివారం జయపూర్ సంధ్యా పంక్షన్ హాల్‌లో దళిత, మైనారిటీ సంఘాల ప్రతినిధులు ఐక్య వేదిక ప్రత్యేక సదస్సు నిర్వహించింది. నబరంగ్పూర్‌కి చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు లలిత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ కొరాపుట్, నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి, రాయగడ జిల్లాలోని గిరిజనులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులు ఇచ్చిందన్నారు. వారు షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్నట్లు రాజ్యాంగం గుర్తించిందన్నారు. ఉపాధి అవకాశాలు మాత్రం అందడం లేదన్నారు. ఈ ప్రాంతంలోని వనరులను తీసుకుంటూ, పరిశ్రమలు నడుపుతూ ఉపాధి మాత్రం స్థానికేతరులకు ఇస్తున్నారని ఆరోపించారు. దండకారణ్య లిబరేషన్ ఆర్గనేజేషన్ రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు మనస్విని టక్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా.. పాలకులు ఇక్కడి వెనుకబడిన తరగతుల ప్రజలను ఆదుకోలేదన్నారు. తాము నెల రోజులలో అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన వేలాది మందితో ప్రత్యేక కొరాపుట్ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో దళిత, వెనక బడిన, మహిళా, సీనియర్ సిటిజన్లు, తదితర సంస్థలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

20 యూనిట్ల రక్త సేకరణ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మమత బెహర

జయపురం: జయపురం సమితి బరిణిపుట్ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం గ్రీష్మ కాల స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. వేసవిలో రక్త కొరత నివారించేందుకు ఒడిశా రక్త దాత మహాసంఘం ఆహ్వానం మేరకు జయపురం ప్రతిమ అంబిక ట్రస్టు గ్రీష్మ కాల రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ట్రస్టు అధ్యక్షురాలు మమత బెహర ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పెహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదుల తుపాకుల దాడిలో మరణించిన పర్యాటకులకు నివాళులర్పించారు. శిబిరంలో ట్రస్టు కార్యకర్తలు, ఒడిశా రక్తదాత మహాసంఘ ప్రతినిధి ప్రమోద్ కుమార్ రౌళో శిబిరాన్ని పర్యవేక్షించారు. జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ టెక్నికల్ బృందం దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మమతా బెహర మాట్లాడుతూ.. రక్త దానం బృహత్తరమైనదన్నారు. రోడ్డు ప్రమాదాలలో క్షతగాత్రులకు, గర్భిణులకు, సికిల్‌సెల్, అలోసెమియ, కేన్సర్ రోగులకు రక్తం ఎంతో అవసరం ఉంటుందన్నారు. రక్తాన్ని దానం చేసేందుకు అర్హులందరూ ముందుకు రావాలన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా రక్తదానం చేస్తే కొరతను నివారించవచ్చున్నారు. ఫెడరేషన్ ఆఫ్ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఒడిశా బ్లడ్ డొనేషన్ శిబిరానికి పూర్తి సహకారం అందజేశారు. శనివారం రాష్ట్రంలో ఒడిశా రక్తదాత మహాసంఘం 45 రక్తదాన శిబిరాలు నిర్వహించి 1755 యూనిట్ల రక్తాన్ని సేకరించిందని మహాసంఘ ప్రతినిధి ప్రమోద్ కుమార్ రౌళో వెల్లడించారు. ఈ సందర్భంగా రక్త దాతలకు ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఘటనా స్థలంలో పర్సు గౌడ మృత దేహం



ప్రమాదానికి కారణమైన వ్యాన్

- ఇద్దరి పరిస్థితి విషమం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ పట్టణం సమీపంలోని బుర్జా జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎదురుగా వస్తున్న బైక్‌ను వ్యాన్ ఢీ కొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తుల్లో సందస గ్రామానికి చెందిన పర్సు గౌడ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మరో ఇద్దరిని ఉమ్మర్ కోట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ప్రకటించారు. ఈ ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్ సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు. ఉమ్మర్ కోట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు డిమాండ్



అవిభక్త కొరాపుట్ స్వతంత్ర రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ సమావేశంలో ప్రసంగిస్తున్న నేతలు



సమావేశంలో పాల్గొన్న నాలుగు జిల్లాల ప్రతినిధులు

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాలను(కొరాపుట్,రాయగడ, నవరంగపూర్, మల్కన్‌గిరి జిల్లాలు)ను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన పలువురు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక ఒక కల్యాణ మండపంలో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌పై నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఖనిజ సంపదకు జల సంపదకు, అటవీ సందకు నిలయమైన అవిభక్త కొరాపుట్ నేటికీ అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉందని, ముఖ్యంగా ప్రయాణ సౌకర్యాలకు, విద్య, వైద్య, వ్యవసాయం, సాగు నీటి వనరుల, నిరుద్యోగ సమస్యలతో కొట్టుమిట్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించేందుకు పాలకులు సంతృప్తికరమైన చర్యలు చేపట్టలేదని పలువురు విమర్శించారు. ఒడిశా రాష్ట్రం ఏర్పడి 89 ఏళ్లు గడిచినా అవిభక్త కొరాపుట్ అభివృద్ధిలో అభివృద్ధి చెందలేదన్నారు. అందుకే ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండ్ చేస్తున్నామని అన్నారు. సమావేశంలో నాలుగు జిల్లాల నుంచి పలువరు ప్రముఖులు పాల్గొన్నారు. ప్రతిపాదిత కొరాపుట్ స్వతంత్ర రాష్ట్ర ఏర్పాటు సంఘం నిర్వహించిన సమావేశానికి దళిత సమాజ్ నేత ప్రభీర్ పాత్రో అధ్యక్షత వహించారు. సమావేశంలో రజిత్ బిశ్వాల్, జగన్నాథ్ పంగి, లలిత మోహణ నాయిక్, ప్రభాకర హంతాల్, దబ్యాధన్ సున, మనోరంజన్ కార్తీక్, భగీరత్ నాయిక్, అశోక్ పంగి, సుధీర్ పాత్రో, ఉదిత్ కోశ్ల, సను అనుగు, ప్రహ్లాద్ హంతాల్, మాలతీ మఝి, మనశ్వినీ టక్రి తదితరులు పాల్గొన్నారు.

‘వందే భారత్ నడపాలి’



భువనేశ్వర్- విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

జయపురం: వందేభారత్ రైలును కొరాపుట్ వరకు నడిపించాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఒడిశా ముఖ్యమంత్రి మోహణ మాఝిలకు లేఖలు రాశారు. భువనేశ్వర్–విశాఖపట్నం–అరుకు–కొరాపుట్ దూరం 669 కిలోమీటర్లేనని, అందుకే భువనేశ్వర్–విశాఖపట్నం వందే భారత్ రైలును విశాఖపట్నం నుంచి అరుకు మీదుగా కొరాపుట్ వరకు నడపాలని డిమాండ్ చేశారు. భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వరకు నడిచే వందే భారత్ రైలు కేవలం 444 కిలోమీటర్ల దూరం లోగల విశాఖపట్నం కేవలం 5 గంటలలో చేరుతుందని, మరో 225 కిలోమీటర్లు పొడిగిస్తే మరో 4 గంటల్లో కొరాపుట్ చేరి తిరిగి 9 గంటలలో భువనేశ్వర్ చేరుతుందని వివరించారు. అందువల్ల కొరాపుట్ జిల్లాలో నందపూర్, లమతాపుట్ మొదలగు ఆదివాసీ ప్రాంతాల ప్రజలకు నేరుగా భువనేశ్వర్ వెళ్లే సదుపాయం కలుగుతుందన్నారు.

దివ్యాంగులను ఆదరించడం సామాజిక బాధ్యత



కృత్రిమ కాళ్లు అమర్చిన దివ్యాంగ బాలుడిని నడిపిస్తున్న ఎంపీ బలబద్ర మజ్జి

కొరాపుట్: దివ్యాంగులను ఆదరించడం సామాజిక బాధ్యత అని నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి పేర్కొన్నారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో మండయ్ గ్రౌండ్స్ సమీపంలో డాల్ఫిన్ రిసార్టులో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చే శిబిరంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దివ్యాంగులైనందుకు చింతించవద్దన్నారు. ఆదుకోవడానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రస్తుతం మార్వాడి యువ మంచ్ సహకారంతో రాజస్థాన్ నుంచి వచ్చిన నిపుణులు కృత్రిమ కాళ్లు, చేతులు ఉచితంగా దివ్యాంగులకు అమరుస్తున్నారు. ఈ శిబిరానికి ప్రభుత్వ సహకారం అందించిందన్నారు. గత మూడు రోజులుగా ఈ శిబిరానికి అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి వందలాది దివ్యాంగుల వచ్చి ఉచితంగా కృత్రిమ అవయవాలతో ఆనందంగా తిరిగి వెళ్తున్నారని ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పలువురు బాల దివ్యాంగుల కష్టసుఖాలను తెలుసుకున్నారు.

శ్రీ క్షేత్రంలో వైభవంగా నృసింహ జయంతి

- రథ స్తంభాల తయారీకి అంకురార్పణ



రథ స్తంభాల తయారీ పనుల్లో వడ్రంగులు (ఇన్‌సెట్లో) పూజలందుకున్న నృసింహ స్వామి



భువనేశ్వర్:

పవిత్ర వైశాఖ శుక్ల పక్ష చతుర్దశి పురస్కరించుకుని సంప్రదాయం ప్రకారం ఆదివారం శ్రీ క్షేత్రంలో నృసింహ స్వామి జయంతి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమందిరం ముక్తి మండపం సమీపంలోని నరసింహ స్వామి ఆలయంలో నరసింహుడి జయంతి ఉత్సాహభరితంగా నిర్వహించారు. సాయంత్రం ధూపం తర్వాత దక్షిణ గృహం నుంచి నరసింహ విగ్రహం పల్లకిలో ఊరేగింపుగా జగన్నాథ వల్లభ మఠానికి చేరి ఉత్సవ పూజాదులు అందుకున్నాడు. హిరణ్యకశిపుని వధ అక్కడే జరుగుతుంది. నరసింహుడిని జగన్నాథుని రక్షకుడిగా అభివర్ణించారు. ఆయన నందిఘోష రథానికి రక్షకుడు. శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథంలోని తొమ్మిది పార్శ్వదేవతలలో నరసింహ కూడా ఒకరు కావడం విశేషం. కొనసాగుతున్న రథాల తయారీ పనుల్లో నృసింహ జయంతి పురస్కరించుకుని ఈ పార్శ్వ దేవత తయారీ పనులకు అంకురార్పణ జరిపారు. ఈ సందర్భంగా రథాల స్తంభాల తయారీకి రూపకార్ సేవకులు శ్రీకారం చుట్టారు. 12 అడుగుల పొడవైన దూలం రథ తయారీ శాలకు తరలించడంతో విశ్వకర్మ మహారణల పర్యవేక్షణంలో లాంఛనంగా ఆరంభ పూజాదులు నిర్వహించారు. రూపకార్ వడ్రంగులు రథ స్తంభాలపై పార్శ్వ దేవతల మూర్తుల ఆకృతుల్ని తీర్చిదిద్దుతారు. ఈ ప్రక్రియలో భాగంగా తొలుత జగన్నాథుని నందిఘోష్ రథం స్తంభానికి నృసింహ మూర్తి ఆకృతిని తీర్చిదిద్దే పనులను ప్రారంభించారు.

క్లుప్తంగా

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న సుశీల్ పాల్, అంజలీ పాల్

కొరాపుట్: స్వగ్రామంలోని దేవాలయాలను హైకోర్టు మాజీ జడ్జి దంపతులు సందర్శించారు. ఆదివారం నబరంగ్‌పూర్ పట్టణానికి చెందిన మధ్యప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుశీల్ పాల్, అతని సతీమణి మధ్యప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి అంజలీ పాల్ స్వగ్రామంలో పర్యటించారు. పురాతన ఈశ్వర్ మందిరం, జగన్నాథ, బండారు ఘరణి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాల్ దంపతులు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం స్వస్థలం. ఇద్దరు మాజీ హైకోర్టు న్యాయమూర్తులు రాక సందర్భంగా పోలీసులు పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేశారు.

శ్రీముఖలింగంలో భక్తుల సందడి



స్వామి దర్శనం చేసుకుంటున్న భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వైశాఖమాసం మొదటి ఆదివారం భక్తులు సందడి చేశారు. హిరమండలం పరిధి అంబావిల్లి త్రినాథ స్వామికి మొదటి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు శ్రీముఖలింగం తండోపతండాలుగా వచ్చి పూజలు నిర్వహించారు. అలాగే జిల్లా నలుమూలలతో పాటు పక్క రాష్ట్రాలైన వియనగరం, విశాఖపట్నం, అనకాపల్లి తెలంగాణ, చత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు తరలి వచ్చారు. అర్చకులు గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వారాహి అమ్మవారికి కూడా కుంకుమ పూజలు చేశారు. మరికొందరు తమ కోర్కెలు తీరడంతో గోలెంలో బియ్యం వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలు

రణస్థలం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, హైవే పెట్రోలింగ్ ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న లారీ ముందు వెళుతున్న లారీని బలంగా ఢీ కొట్టింది. దీంతో క్లీనర్ సదాశివం కాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది. వెంటనే హైవే పోలీసులు అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్ : దేశ సరిహద్దులో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య కూడళ్లలోను, ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లలో ముమ్మరంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, నియంత్రణ, పేలుడు పదార్థాల గుర్తింపు, సంఘ విద్రోహక శక్తుల అడ్డుకట్ట, కొత్త, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులు పూర్తి నిఘా పెట్టారు.

కళకళలాడిన కాంప్లెక్స్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం ప్రయాణికులతో కళకళలాడుతూ కనిపించింది. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ప్రయాణికుల తాకిడి మరింత అధికమైంది. తిరుగు ప్రయాణంలో కాంప్లెక్స్‌లో నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికులు టికెట్‌ల కోసం క్యూలో బారులు తీరుతూ కనిపించారు. నాన్‌స్టాప్ బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ అధికారులు త్వరితగతిన స్పందించి ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు నాన్‌స్టాప్ బస్సుల స్థానంలో పల్లెవెలుగు బస్సులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడిపారు.



నాన్‌స్టాప్ క్యూలో బారులు తీరిన ప్రయాణికులు

బీజేపీని మరింత పటిష్టం చేయాలి

- పార్టీ రాష్ట్ర శాఖ ఆర్గనైజేషనల్ కార్యదర్శి మానస్ మహంతి

రాయగడ:

రాయగడ జిల్లాలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఆర్గనైజేషనల్ కార్యదర్శి మానస్ మహంతి అన్నారు. గుణుపూర్‌లో శనివారం పర్యటించారు. సాయంత్రం అక్కడ గల నిమంత్రణ్ కళ్యాణ మండపంలో క్రియాశీలక కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీ జెండా ఎగుర వేయాలంటే అందుకు ఇప్పటి నుంచే కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అన్నారు. ముఖ్యంగా వ్యూహం ప్రకారం ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల సమీకరణ వంటి ముందస్తు పనులకు శ్రీకారం చుట్టాలని.. సీనియర్ నాయకులు ఆ దిశగా కృషి చేయాలని హితవు పలికారు. కార్యకర్తల సమీకరణతోపాటు వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం గ్రామాల్లో తిరిగి ప్రజలకు ఆ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయమై తెలుసుకోవడంతో పాటు వారికి పథకాలకు సంబంధించి అవగాహన కల్పించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే రానున్న పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేందుకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్, ఎస్సై, ఎస్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు కాశీరాం మాఝి, సీనియర్ నాయకుడు త్రినాథ గొమాంగో పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మానస్ మహంతి

దేవుడి పేరిట దోపిడీ

- పొనుటూరులో ఇసుక దందా
- ఒడిశాకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- వరద గట్టును సైతం తవ్వేసిన వైనం



పొనుటూరు గ్రామం సమీపంలోని వంశధార నుంచి ఒడిశా ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేస్తున్న కార్మికులు

కొత్తూరు:

దేవుడి పేరు చెప్పి మరీ అధికార పార్టీ నేతలు ఇసుక దోపిడీకి తెగబడుతున్నారు. ఉచిత ఇసుక పథకం ఆ నాలుగు గ్రామాల టీడీపీ నేతలకు దేవుడు వరంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆలయాలు నిర్మిస్తున్నామంటూ పొనుటూరు పంచాయతీ పరిధిలోని పాతపొనుటూరు, పొనుటూరు కాలనీ, కొత్తపొనుటూరు, బంకి గ్రామాలకు చెందిన కొంత మంది నేతలు ఇసుక ట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడంతో వీరి దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది.

కొత్తూరు మండలంలోని పాత పొనుటూరుకు అనుకొని ఉన్న వంశధార నదిలో అక్రమ ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్నారు. ర్యాంపు నుంచి ఇసుక తీసుకెళ్లే ఆంధ్రా వాహనాల నుంచి రూ.200, ఒడిశా వాహనాల నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. అసలే అక్రమ ర్యాంపు. ఆపై అక్రమ వసూళ్లు కావడంతో స్థానికులు కూడా నిశ్చేష్టులవుతున్నారు. గత 8 నెలలుగా ఈ దందా సాగుతోంది. నాలుగు గ్రామాలకు చెందిన కొంత మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇలా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా రెవెన్యూ, మైన్స్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వీరికి అడ్డు అదుపు లేకుండా పోతోంది.

వాస్తవానికి ఆంధ్రా నుంచి ఇసుక ఒడిశాకు రవాణా చేయకూడదని నిబంధన ఉన్నా.. ఒడిశాకు చెందిన ట్రాక్టర్లతో పొనుటూరు నుంచి ఇసుక తీసుకెళ్తున్నారు. ఒడిశాకు తరలిస్తున్న ట్రాక్టర్ నుంచి రూ.500ను దేవుడి పేరుతో గుంజుకుంటున్నారు. సాక్షాత్తు గ్రామ సచివాలయం పక్క నుంచే అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నా పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం. ఇదే పంచాయతీ పరిధి బంకి గ్రామం నుంచి నదిలో ఇసుక అక్రమ రవాణా కోసం పూర్తిగా వరద గట్టును తవ్వేశారు. నదికి వరదలు వస్తే వరద నీరంతా పంట పొలాల్లోకి, గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించే ప్రమాదం ఉంది. ఇంత జరుగుతున్నా వంశధార ఇంజినీరింగ్ అధికారులకు పట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారి ఆట కట్టించాలని, అక్రమ ఇసుక రవాణా ఆపాలని కోరుతున్నారు.



పొనుటూరు గ్రామం వద్ద వంశధారలో ఇసుక లోడింగ్ కోసం ఉన్న ఒడిశాకు చెందిన ట్రాక్టర్లు

తగిన చర్యలు తీసుకుంటాను



పొనుటూరు వంశధారలో నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే చర్యలు తీసుకుంటాను. ఒడిశాకు ఇసుక తరలించకూడదు. దేవుడి పేరుతో అక్రమ వసూళ్లు చేయడం నేరం.

– కె.బాలకృష్ణ, తహసీల్దార్ కొత్తూరు

మరణించిన 22 రోజులకు..

కాశీబుగ్గ:

ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి ఊహించని రీతిలో మరణించిన యువకుడి మృతదేహం ఇరవై రెండు రోజుల అనంతరం స్వదేశానికి చేరుకుంది. పలాస మండలం తర్లాకోట పంచాయతీ ఖైజోల గ్రామానికి చెందిన బుడత దామోదర (33) గత నెల 21వ తేదీ సోమవారం మరణించినట్లు ఇక్కడకు సమాచారం వచ్చింది. పోలాండ్ దేశంలో వెల్డర్‌గా పనిచేసేందుకు వెళ్లి ఓ పార్కులో ఊయల వద్ద మరణించడం సంచలనంగా మారింది. దామోదర్‌కు అమ్మ పున్నమ్మ, పెరాలిసిస్‌తో బాధపడుతు న్న తండ్రి లక్ష్మీనారాయణ, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దివ్యాంగుడైన అన్నయ్య, అతని భార్య పిల్లలతో కలిసి ఉమ్మడిగా జీవిస్తున్నారు. వారందరి కీ దామోదర్ మాత్రమే ఆధారం. కుటుంబం కోస మే ఆయన పోలాండ్ వెళ్లాడు. ఇంటి కోసం అంతదూరం వెళ్లి తిరిగి విగతజీవిగా రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఆయన చనిపోయిన ఘటనపై 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. అయితే అక్కడ నిబంధనల ప్రకారం ప్రక్రియలు అన్నీ పూర్తయ్యి మృతదేహం స్వగ్రామానికి చేరేందుకు 22 రోజులు పట్టింది.



దామోదర్ (ఫైల్)

ఆదివారం అంత్యక్రియలు

దామోదర్ మృతదేహానికి స్వగ్రామం ఖైజోల గ్రామంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలాండ్ తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్ర బాను, చంద్ర అల్లూరి, రమేష్‌లు కష్టపడగా ఇండియన్ ఎంబసీ ఎంతో సహకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు.



పలాస మండలం ఖైజోల చేరుకున్న దామోదర్ మృతదేహం

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం గ్రామానికి చెందిన సీపాన రవి (48) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యాపారం చేస్తూ జీవ నం సాగిస్తున్న ఈయనకి మద్యం అలవాటు ఉంది. దీంతో తరచూ ఇంటిలో గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో క్షణికావేశంలో శనివారం పురుగుల మందు తాగేశారు. గమనించిన కుటుంబ సభ్యు లు, బంధువులు ఆయనను స్థానిక ప్రైవేటు ఆస్పత్రి లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతునికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ముగిసిన మాక్ డీఎస్సీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎర్రన్న విద్యా సంకల్పం పేరిట డీఎస్సీ అభ్యర్థులకు నిర్వహించిన మాక్ డీఎస్సీ ముగిసింది. ఆదివారం జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో ఈ రెండు కేంద్రాల్లో జరిగిన ఈ మాక్ టెస్టుకు 300 మంది అభ్యర్థులు హాజరైనట్లు స్థానిక ఎంపీ కార్యాలయ ప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీకాకుళం యువతకు, వారిలో ని ప్రతిభను ముందుగా తెలుసుకునేందుకు ఎర్రన్న విద్యా సంకల్పం పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు సందేశాన్ని పంపించినట్లు వెల్లడించారు.

ఎన్నేళ్లకు పెద పండగ వచ్చె..

- మెట్టవలసలో ఎట్టకేలకు గ్రామదేవత పండుగలు
- సిరిమాను, ఘటాలు లేకుండా ఉత్సవాల నిర్వహణ



జి.సిగడాం: మెట్టవలస కొండ ఇదే



పూజలు చేస్తున్న గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని మెట్టవలసలో ఎట్టకేలకు గ్రామదేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామస్తులు నిర్ణయం చేశారు. గ్రామంలో 650 ఇళ్లు ఉన్నాయి. అంతా కలిసికట్టుగా పండుగ నిర్వహించేందుకు తీర్మానించారు.

80 ఏళ్ల తర్వాత..

గ్రామంలో ఈ ఉత్సవాలు జరిగి 80 ఏళ్లయ్యాయి. అప్పటి నుంచి ఉత్సవాలు జరగనేలేదు. మళ్లీ ఆ నాటికి ఉత్సవం నిర్వహిస్తుండడంతో ఊరు ఊరంతా సంబరపడుతోంది. దాదాపు రూ.7కోట్ల వ్యయంతో జాతర నిర్వహిస్తున్నారు. అయితే సిరిమాను గానీ, ఘటాలు గానీ లేకుండా పండుగ జరిగేలా ఏర్పాట్లు చేశారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నా చిన్నప్పుడు జరిగింది..



నాకు 85 ఏళ్లు. నా చిన్నప్పుడు మా ఊరిలో గ్రామ దేవత పండగ చేశారు. నాకు తెలిసీతెలియని వయసులో జరిగింది. ఇప్పుడు మళ్లీ మా గ్రామస్తులంతా కలిసి గ్రామదేవత పండగను నిర్వహిస్తున్నాం.

– దకర లక్ష్మణనాయుడు, మెట్టవలస

80 ఏళ్లవుతోంది..



నాకు 90 ఏళ్లు. నేను 5వ తరగతి చదువుతున్నప్పుడు మా గ్రామంలో తాతలు, పెద్దలు గ్రామ దేవత పండగ చేశారు. మా ఊరిలో మొదటి ఉద్యోగం చేసిన వాడిని నేనే. ఈ వయసులో మళ్లీ గ్రామదేవత పండగ చూసే అదృష్టం కలగడం ఆనందంగా ఉంది.

– యడ్ల ఆదినారాయణ, విశ్రాంతి పంచాయతీ అధికారి, మెట్టవలస

మాతృమూర్తులకు అవార్డుల ప్రదానం

పర్లాకిమిడి: మాతృమూర్తికి మించిన మహనీయులు ఎవ్వరూ లేర సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితాపాత్ర్ అన్నారు. గజపతి ప్యాలస్‌లోని యూటెక్ కంప్యూటర్ కార్యాలయంలో ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'అంతర్జాతీయ మాతృ దినోత్సవం'కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాతృదినోత్సవం, పంచమ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థినులకు మాతృ దినోత్సవంపై వక్తృత్వ పోటీలను ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శథపతి నిర్వహించారు. జ్యూరీ సభ్యులుగా భాగవత్ పాఢి వ్యవహరించారు. అనంతరం సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్ర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పర్లాకిమిడి శ్రేష్ట అమ్మగా రత్నమాలా పట్నాయక్, శశి రేఖా మిశ్రాకు మాతృమూర్తి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యవక్తగా బిచిత్రా నందె బెబర్తా వ్యవహరించగా, ప్రధాన ఉపాధ్యాయులు సురేష్‌కుమార్ సాహుకార్ (రాయఘడ), రంజితా త్రిపాఠి, అధ్యక్షురాలు కల్పనా పట్నాయిక్, లోకనాథ్ మిశ్రా పాల్గొన్నారు.



మాతృమూర్తి గొప్పతనాన్ని వివరిస్తున్న ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శథ్పతి

దళిత విద్యార్థులకు న్యాయం చేయండి

కాశీబుగ్గ: పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం జిల్లా దళిత సంఘాల సంయుక్త మండలి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో బాలికల/బాలుర గురుకుల పాఠశాలలు 1983లో స్థాపించారని సుమారుగా 30 ఏళ్ల నుంచి అవే భవనాలు ఉండడం, కొత్త భవనాలు అరకొరగా ఉండడం, మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని అన్నారు. గత 15 ఏళ్లుగా గురుకులాల్లో దళిత విద్యార్థుల చేరికలు తగ్గుతున్నాయని, అందుకు గల కారణాలు విశ్లేషించాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఉన్న సమస్యలపై ప్రత్యేకమైన కమిటీతో అధ్యయనం చేయించాలని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఏ రకమైన సమస్యలు లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, బెలమర ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి మద్దిల వినోద్, జిల్లా కార్యదర్శి యడ్ల గోపి, ధర్మారావు, కరుణాకర్, బి.దుర్యోధన, ఎస్‌జీఓ నాయకులు బోనెల గోపాల్, చల్లా రామారావు, గెజిటెడ్ అధికారుల సంఘం గొజ్జ నాగరాజు, ఆదివాసీ సంఘం నాయకులు వరహాల భాగ్యరావు, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఇప్పిలి చంద్రశేఖర్, పిలక శ్రీను, ఉదయపురం శ్రీనివాసరావు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘ నాయకులు

'బకాయి వేతనాలు చెల్లించండి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెల్లించాల్సిన మార్చి నెల బకాయి వేతనం రూ. 7,200 వెంటనే చెల్లించా లని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌర వ అధ్యక్షులు కె.నాగమణి, డి.ధనలక్ష్మి, జి.అమ రావతి డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలో సీఐటీయూ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలలో మార్చి నెల పూర్తి వేతనం చెల్లించినా శ్రీకాకుళం జిల్లాలో జిల్లా అధికారుల జాప్యం వల్ల జీతం రాలేదని అన్నా రు. ఆశాలకు రికార్డులు అవసరం లేదని మొబై ల్ యాప్‌లో పని చేయాలని రాష్ట్ర అధికారులు ఆదేశాలిస్తే జిల్లాలో రికార్డు పని, ఆన్‌లైన్ పని రెండు రకాలు పనులు చేయిస్తూ పని భారం పెంచుతున్నారన్నారు. లేబర్ కోడ్లు రద్దు, కనీ స వేతనం 26 వేలు ఇవ్వాలని కోరుతూ కార్మి క సంఘాలు పిలుపుమేరకు మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను ఆశాలంతా జయప్రదం చేయాలని కోరారు.

'అఖిలభారత సమ్మె విజయవంతం చేయండి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మే 20న అఖిలభారత సమ్మె విజయవంతం చేయాలని కార్మిక, ప్రజా సంఘాలు నాయకులు కోరారు. 'లేబర్ కోడ్లు– కార్మిక హక్కులపై దాడి' అనే అంశంపై మే 20 సమ్మె జయప్రదంకై కార్మిక,ఉద్యోగ సంఘాలు ఆధ్వర్యంలో జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరణ సదస్సు జరిగింది. ఈ సదస్సులో వివిధ కార్మిక, ప్రజా సంఘాలు నాయకులు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు సవరించాల్సిన కనీస వేతనాలు గత 20 ఏళ్లుగా సవరించలేదని, కార్మికులు వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారన్నారు.

నేను కుందువానిపేట..

వింటారా నా మాట



ప్రియమైన పర్యాటకులకు..
మీ కుందువానిపేట సముద్ర తీరం..
ఆశీర్వదించి రాయు విన్నపం..
మీకు గుర్తుందో లేదో.. ఒకప్పుడు మీలో చాలా మంది నా ఒడిలో ఆడుకునేవారు.
పొద్దు పోయే వరకు ఇక్కడే ముచ్చట్లాడుకునేవారు.
ఈ తీరాన ఉండే చిన్ని పాకల్లో చిరుతిళ్లు కొనుక్కుని ఇంటిల్లిపాదీ ఆనందించేవారు..
మీ ముఖాల్లో వెల్లివిరిసే సంతోషం చూసి నాకూ ముచ్చటేసేది..
కానీ ఏ దిష్టి తగిలిందో..
ఇప్పుడు నా వద్దకు రావడమే మానేశారు..
పిల్లలు, పెద్దలు నావైపు చూడడమే లేదు..
ఒక ఆదివారం కాకపోతే మరో వారమైనా వస్తారని ఎదురు చూస్తున్నాను..
కానీ ఎవరూ రావడం లేదు..
పోనీలే.. కార్తీకంలో వస్తారు అనుకునేదాన్ని..
కానీ నా అంచనా తప్పిపోయింది..
ఒకప్పుడు కళకళలాడిన ఈ పాకలు ఇప్పుడు కూలిపోయాయి..
స్వచ్ఛమైన నా ఇసుక తిన్నెల మధ్య ఏవేవో సీసా ముక్కలు గుచ్చుకుంటున్నాయి..
ఒకప్పుడు రాత్రి 8 గంటల వరకు నా ఒడిలో చాలా మంది సేదతీరేవారు..
కానీ ఇప్పుడు రాత్రయితే చాలు ఇటుగా రావడానికే చాలా మంది భయపడుతున్నారు..
విద్యుత్ బల్బులన్నీ పాడైపోయాయి..
అనాదిగా అందాలు పంచిన ఈ ప్రదేశం..
ఇప్పుడు అందవిహీనమవుతోంది..
ఇది నేను తట్టుకోలేకపోతున్నా..
నాకు మళ్లీ వెనకటి రోజులు కావాలి..
పిల్లలంతా నా ఒడిలో ఆడుకోవాలి..
మీరంతా ఉదయాస్తమయాలు ఇక్కడి నుంచి మళ్లీ ఆస్వాదించాలి..
ఆ పాకలన్నీ మళ్లీ కళకళలాడాలి..
సీసా ముక్కలు కనిపించని ఇసుక తిన్నెలు మిమ్మల్ని స్వాగతించాలి.
నా అలల ఘోషనే నా విన్నపంలా భావించండి..
నా కెరటాలు మీ కోసమే వస్తున్నాయని తెలుసుకోండి..
నా విన్నపాన్ని మన్నిస్తారని భావిస్తూ..

మీ
కుందువానిపేట సముద్ర తీరం.

– శ్రీకాకుళం రూరల్



చెత్తా చెదారాలతో నిండి ఉన్న బీచ్

క్లుప్తంగా

అనధికార మద్యం దుకాణాలపై దాడి

- 10 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు


అల్లాడపాలెంలో చేసిన దాడుల్లో దొరికిన మద్యం బాటిల్స్

పూసపాటిరేగ: మండలంలోని చోడమ్మ అగ్రహారంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపులపై భోగాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దాడుల్లో చోడమ్మ అగ్రహారానికి చెందిన వ్యక్తి పట్టుబడడంతో 10 మద్యం బాటిల్స్‌తో అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరూ అనధికారికంగా మద్యం దుకాణాలు (బెల్ట్ షాపులు) నిర్వహించరాదని, ప్రోత్సహించరాదని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎస్సై చంద్రమోహన్ హెచ్‌సీ రామారావు, కానిస్టేబుల్ మహేష్‌లు పాల్గొన్నారు.

ఎండవేడికి కాలిపోయిన ట్రాక్టర్ ఇంజిన్


ఎండవేడికి తగలబడుతున్న ట్రాక్టర్ ఇంజిన్

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లి పంచాయతీ పరిధి ఎరుకులపేట హోలీ స్పిరిట్ పాఠశాల సమీపంలో గల ఇటుకల బట్టీ వద్ద ఉంచిన ట్రాక్టర్ ఇంజిన్‌లో ఎండవేడికి ఒక్కసారిగా మంటలు వచ్చి ఆదివారం కాలిపోయింది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొట్నూరు శివ తన ట్రాక్టర్‌ను ఇటుకల బట్టీ వద్ద ఉదయం 11 గంటల ప్రాంతంలో ఉంచి పక్కనే సేదతీరాడు. అంతలోనే ఇంజిన్ నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చి వెంటనే పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఆ మంటలను అదుపు చేయడానికి స్థానికులు సాహసించినా నిలువరించ లేకపోయారు. దీంతో ఎస్.కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అప్పటికే ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయిందని శివ తెలిపాడు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


వైద్యం కోసం 108లో తరలిస్తున్న దృశ్యం

కొత్తవలస: కొత్తవలస–దేవరాపల్లి రోడ్డులో దేవాడ జంక్షన్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కవరపుకోట మండలం కోన మసివానిపాలెం గ్రామానికి చెందిన గాడి తాత (63) మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాడి తాత దేవాడ జంక్షన్ నుంచి నడుచుకుంటూ వస్తుండగా తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వచ్చి వెనుకనుంచి వచ్చి తాతాను ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాలపాలైన తాతను స్థానికుల సహాయంతో 108 వాహనంలో విశాఖపట్నం తరలించే క్రమంలో పెందుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించగా అప్రటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడుకి భార్య సన్యాసమ్మతో పాటూ ఒక కూతురు ఉంది. ఫిర్యాదు మేరకు కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. .

లారీ ఢీకొని యువకుడు..


జానకీరాం మృతదేహం

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామ పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి26పై లారీ ఢీకొనగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందాడు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్సై యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు నియోజకవర్గంలోని మక్కువ మండలం, మక్కువ గ్రామంలోని శ్రీదేవి కాలనీకి చెందిన యువకుడు తుమరాడ జానకీరాం (22) ద్విచక్రవాహనంపై విశాఖపట్నం నుంచి స్వగ్రామం ఆదివారం వస్తుండగా విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో జానకీరాం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం విజయనగరంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

నీలి కిరణాలతో అంధత్వం

- సెల్‌ఫోన్, కంప్యూటర్ అతిగా వాడకంతో ఇబ్బందులు
- చిన్న వయసులోనే దృష్టిలోపాలు
- పెరుగుతున్న దూరదృష్టి సమస్యలు
- కంటివైద్యుల వద్దకు క్యూకడుతున్న బాధితులు


నేత్ర తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: ప్రస్తుత జీవన ప్రమాణాల్లో భాగంగా సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. చిన్నా పెద్ద తేడా లేకుండా ఎవరి చేతిలో చూసినా ఫోన్ కనిపిస్తుంది. ఇంట్లో, బయట, పదిమంది కలిసినచోట, భోజనం చేసిన సమయంలో సెల్‌ఫోన్ వినియోగంలో నిమగ్నమవుతున్నారు. గంటల తరబడి మొబైల్ చూడడం, కంప్యూటర్ స్క్రీన్‌కు అతుక్కుపోవడం వల్ల కంటి సమస్యలు ఎక్కువగా వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు.

దృష్టి లోపానికి కారణాలు..

- డిజిటల్ పరికరాలను విస్తృతంగా వినియోగించడం
- రెండు గంటలకన్నా ఎక్కువగా కంప్యూటర్, సెల్‌ఫోన్ అదేపనిగా చూడడం
- కంప్యూటర్‌లో అక్షరాలను తదేకంగా చూడడంవల్ల కళ్లు ఒత్తిడికి గురవుతాయి
- స్క్రీన్ కాంట్రాస్ట్ ఎక్కువగా ఉండడం
- సాధారణంగా నిమిషానికి 18 నుంచి 20 సార్లు రెప్పవాల్చాలి. కానీ కంప్యూటర్ చూసేవారికి ఇది 3 నుంచి 6 సార్లకు పడిపోతుంది. దీనివల్ల కళ్లలోని ఉపరితలం పొడిబారుతుంది.

చికిత్స, నివారణ..

కళ్లకు తేమను కలిగించేలా కృత్రిమంగా కన్నీళ్లు తరచుగా వాడడం
- ✔ కళ్ల రెప్పలను తరచుగా మూయడం
- ✔ దృష్టిలోపాలకు వాడే అద్దాలు బ్లూఫిల్టర్ ఉండేలా చూడడం
- ✔ స్క్రీన్ టైం తగ్గించుకోవడం
- ✔ 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను 20 సెకెన్లపాటు వీక్షించడం.
- ✔ కంప్యూటర్, సెల్‌ఫోన్ స్క్రీన్ బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్‌ను సర్దుబాటు చేసుకోవడం
- ✔ కంప్యూటర్, సెల్‌ఫోన్‌లో అక్షరాలను పెద్దవిగా చేసుకోవడం.
- ✔ సంవత్సరానికి ఒకటి, రెండు సార్లు డ్రై ఐ గురించి కంటి వైద్యులను సంప్రదించడం

ముఖ్యంగా మొబైల్స్ నుంచి వచ్చే నీలి కాంతి కిరణాలు కంటిపై ప్రభావం చూపి దెబ్బతినే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఒకప్పుడు పగలంతా పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత చీకటి పడగానే తినేసి నిద్రకు ఉపక్రమించేవారు. ఇప్పుడు ప్రజల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. రాత్రి 11 నుంచి 12 గంటల వరకు టీవీలు, మొబైల్స్, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లకు అతుక్కుపోతున్నారు. 60 శాతం ప్రజలు రోజులో 5 నుంచి 6గంటల పాటు సెల్‌ఫోన్ చూస్తున్నారు. యువతీ యువకులు రోజుకు కనీసం 10 గంటలకు పైగా స్క్రీన్ చూస్తున్నారు. ఇలా సెల్‌ఫోన్‌కు బానిస కావడం వల్ల చేతి వేళ్లు సెల్‌ఫోన్‌పైకి వెళ్తుంటాయి. చిన్నారులు సైతం సెల్‌ఫోన్‌కు అలవాటుపడ్డారు. సెల్‌ఫోన్, టీవీల నుంచి వచ్చే కృత్రిమ కాంతిలో ఉండే బ్లూలైట్ కంటిపై ఎక్కువగా పడుతోంది. దీనివల్ల కంటికి కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి.

బ్లూ లైట్‌తో కళ్లకు ప్రమాదం..

మొబైల్ ఫోన్‌లో ఉండే నీలికాంతి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ కాంతి ఎక్కువగా పెట్టుకుని చూడడం వల్ల వాటిలోని రేడియేషన్, అల్ట్రావైలెట్ రేస్ వల్ల కళ్లలో నీళ్లు ఇంకిపోయి పొడిబారుతాయి. విద్యార్థులు, యువకులు మొబైల్, కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను దగ్గర నుంచి చూడడం వల్ల క్రమంగా వారికి మయోపియా (దూరంగా ఉన్నవి కనిపించవు) సమస్య వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా దృష్టిలోపం ఉండేవారిలో ఏడాది నుంచి రెండేళ్లకు వారి కంటి అద్దాల నంబర్ మారుతుంది. కానీ ఎక్కువసేపు ఆన్‌లైన్ క్లాస్‌ల కారణంగా తక్కువ సమయంలోనే కంటి అద్దాల నంబర్ మారుతోంది. దీనికితోడు వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసుల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తదేకంగా మానిటర్లను చూడడం వల్ల కంటి కండరాలపై ఒత్తిడి పెరిగి సాయంత్రం వేళ తలనొప్పి వస్తుంది.

కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు..

- ప్రతి అరగంటకు ఒకసారి మొబైల్, కంప్యూటర్, ల్యాప్‌టాప్ నుంచి రెండు మూడు నిమిషాలైనా దృష్టిని మరల్చాలి.
- కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగుళాల దూరం ఉంచాలి.
- యాంటీగ్లేర్, యాంటీ రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి.
- కళ్ల మంటలు, నీరు కారడం వంటి సమస్యలుంటే కాసేపు మానిటర్లు చూడడం ఆపేయాలి.
- తరచూ చల్లని నీటితో కళ్లను కడుక్కోవాలి. రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడి వస్త్రాన్ని కప్పి ఉంచాలి.
- కంటికి కసరత్తులు సైతం అవసరం. ఇందుకోసం కళ్లను కుడిఎడమలకు నిమిషంపాటు తిప్పాలి. రెండు అరచేతులు రుద్దకుని వేడెక్కిన తరువాత కళ్లపై కాసేపు ఉంచి కసరత్తు చేయాలి.

ఎక్కువగా సెల్‌ఫోన్ చూడరాదు..



కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను ఎక్కువగా చూడడం వల్ల అందులోని నీలికాంతి కళ్లపై పడి కళ్లు దెబ్బతింటాయి. కంటి జబ్బులతో వస్తున్న వారిలో కళ్లు పొడిబారడం, ఎర్రగా మారడం, కళ్లు మంటలు, కంట్లో దురద వంటి సమస్యలు వస్తాయి. మొబైల్స్ అతిగా చూడడంవల్లే ఈ సమస్య అధికమవుతోంది. ప్రస్తుతం వేసవి సెలవుల కారణంగా విద్యార్థులకు సెల్‌ఫోన్ దూరంగా ఉంచడం ఎంతైనా మంచిది.

యన్.లక్ష్మిశ్రీ, నేత్రవైద్యనిపుణురాలు, సీహెచ్‌సీ, రాజాం

చిన్నతనం నుంచే సమస్యలు..



కంటి సమస్యలు చిన్నవయసులోనే ఉత్పన్నమవుతున్నాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థులు తక్కువ కాంతిలో చదడం, ఎక్కువగా సెల్‌ఫోన్ వాడడం వల్ల ఈ సమస్య వస్తుంది. చిన్నారులకు పాఠశాలల్లో నిర్వహించిన తనిఖీల్లో ఎక్కువ మంది ఇటువంటి సమస్యలతో బాధపడుతున్నవారే. అలాగే 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కళ్ల తనిఖీ తప్పకుండా చేయించుకోవాలి.

ఎస్.వసంతరావు, ఆప్తాలమిక్ అధికారి, రాజాం

దేవర మహోత్సవానికి సర్వం సిద్ధం

- సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి ఊరేగింపు
- మంగళవారం నుంచి చదురుగుడిలో అమ్మవారి దర్శనం


పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు దేవర మహోత్సవ ఘట్టం మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి చదురుగుడికి అమ్మవారిని తీసుకువచ్చే అద్భుతమైన అపురూప ఘట్టానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి వనంగుడిలో స్తపన మందిరంలో అమ్మ ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో పూజారి బంటుపల్లి వెంకటరావు, భక్తుల చేతుల మీదుగా అమ్మవారిని అప్పటికే ఆలయం బయట పుష్పాలతో సిద్ధం చేసిన ఉత్సవరథంపై ఆశీనులను చేస్తారు. జయజయ ధ్వానాల మధ్య బాజాభజంత్రీలు, విచిత్ర వేషధారణలు, కోలాటం బృందాలు, డముకు వాయిద్యాలతో రైల్వేస్టేషన్ నుంచి గాడీకానా, సీఎంఆర్ జంక్షన్, వైఎస్సార్ సర్కిల్, ఎన్‌సీఎస్ రోడ్, కన్యకపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, శివాలయం వీధి మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటికి తీసుకువెళ్తారు. అక్కడ రాత్రి 10 గంటల సమయంలో ఘటాలతో అమ్మవారికి నివేదన చేస్తారు. అమ్మవారికి మనవి చెప్పిన అనంతరం కోటలో కొలువైన కోటశక్తికి పూజలు చేస్తారు. వేకువజామున 3 గంటల ప్రాంతంలో అమ్మవారు సాక్షాత్కరించిన పెద్దచెరువు పశ్చిమభాగానికి ఘటాలతో చేరుకుని మనవి చెప్పి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, ఘటాల్లో పసుపు, కుంకుమలతో పాటు పూజ చేసిన అక్షింతలను తీసుకుని మంగళవారం వేకువజామున 5 గంటలకు చదురుగుడికి చేరుకుంటారు.

ఇన్‌చార్జ్ ఈఓ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

అనంతరం ఆలయంలో అమ్మవారికి డప్పువాయిద్యాలు, సన్నాయి మేళంతో పూజలు చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించిన తరువాత 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ అపురూప ఘట్టాలను తనివితీరా చూసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ నేతృత్వంలో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల మహోత్సవం తర్వాత రోజున బుధవారం మళ్లీ అమ్మవారు చదురుగుడి నుంచి వనంగుడికి చేరుకుంటారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని ఆలయ ఈఓ ప్రసాద్ కోరారు.

ఇంటర్‌లో కొత్తపాఠాలు

- సీబీఎస్ఈ అమలుకు సిద్ధం
- అధ్యాపకులకు శిక్షణ పూర్తి
- విద్యార్థులకు అదనపు ప్రయోజనం


సీబీఎస్ఈ సిలబస్‌పై ఆన్‌లైన్ శిక్షణ పొందుతున్న అధ్యాపకులు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ విద్యాబోధనలో నూతన సంస్కరణలను ప్రభుత్వం ఈ ఏడాది చేపడుతోంది. జూనియర్ కళాశాలల్లో సీబీఎస్ఈ అమలుకు ఇప్పటికే అడుగులు పడ్డాయి. కొత్తగా ఎంబైపీసీ కోర్సును అమలుచేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు అధ్యాపకులకు శిక్షణ సైతం ఇచ్చారు. మిగిలిన గ్రూపుల్లో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రకారం పరీక్షల విధానం, మార్కుల కేటాయింపునకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 18 ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్యాకల్టీ అధ్యాపకులకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు స్పెల్‌లలో ఇటీవల శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు.

కోర్సుల నూతన విధానం

ఒకే సబ్జెక్టుగా గణితం–ఎ, ఎ, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం కలిపి బయాలజీగా రూపొందించారు. ఇందుకు తగ్గట్లు మార్కుల విభజన చేశారు. పార్ట్–1 సబ్జెక్టు కింద ఆంగ్లమే ఉంటుంది. పార్ట్–2 కింద జాతీయ భాషలతోపాటు మరికొన్ని సబ్జెక్టులు ఉంటాయి. విద్యార్థి అభీష్టం మేరకు దేనినైనా ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. పార్ట్–3లో ఎంపీసీ, బైపీసీ సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ గ్రూపులుంటాయి. సెకెండ్ లాంగ్వేజీకి సంబంధించి తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూకు బదులు గణితం, ఎంపీసీలో చేరిన వారు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూకు బదులుగా బయాలజీని తీసుకోవచ్చు.

విద్యార్థులకు అదనపు ప్రయోజనం

నూతన విధానంలో భాగంగా ఎంపీసీ తీసుకున్న విద్యార్థి అదనంగా బయాలజీ, బైపీసీ తీసుకున్న వారు గణితం తీసుకునే అవకాశం కల్పించారు. పార్ట్–1, 2, 3 సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులనే పరిగణిస్తారు. అదనంగా తీసుకున్న సబ్జెక్టుల మార్కులను ఇందులో కలపరు. కనీసం 35 మార్కులొస్తేనే ఉత్తీర్ణత సాధించినట్లు. ఉత్తీర్ణులు కాకపోయినా ధ్రువీకరణ పత్రం ఇస్తారు. అదనపు సబ్జెక్టులో ఉత్తీర్ణులైతే భవిష్యత్తులో మెడికల్, ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ తదితర కోర్సులు అభ్యసించేందుకు అవకాశం ఉంటుంది. సదరు విద్యార్థి నీట్, ఏపీఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. కొత్త సిలబస్ ఆధారంగా అన్ని సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలకు ప్రశ్నపత్రాలు మారుతాయి. ఒక్క మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టనున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సిలబస్‌లో గానీ, పరీక్ష ప్రశ్నపత్రంలో గానీ ఎటువంటి మార్పు ఉండదు.

విద్యార్థులకు మంచి అవకాశం



ఇంటర్‌లో ఎంబైపీసీ కోర్సులు విద్యార్థులకు విభిన్న రంగాలలో చదువుకోవడానికి మంచి అవకాశం. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీపడే అవకాశాలు లభిస్తాయి. సీబీఎస్ఈ సిలబస్ పాఠ్యాంశాల మార్పులతో పాటు కొత్త కోర్సులు ఈ విద్యాసంవత్సరం నుంచి అమలులోకి వస్తున్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఉన్నతవిద్యలో మరిన్ని అవకాశాలు సాధ్యం.

శివ్వాల తవిటినాయుడు, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈఓ)

హృదయాలను తాకిన నాటికలు


కొత్త పరిమళం నాటికలో ఓ సన్నివేశం

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా గరివిడిలోని శ్రీరామ్ హైస్కూల్ ఆవరణంలో గరివిడి కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నాటికల పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు రోజున ప్రదర్శించిన కొత్త పరిమళం, చీకటిపువ్వు, దేవరాగం నాటికలు చక్కటి కథా సారాంశాన్ని అందించి ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్నాయి. బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవాసంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. జాతి,మత,కుల,ప్రాంతాల పేరుతో విధ్వంసాలు రేగుతున్న భూమండలంలో ప్రేమ, అభిమానం, అనురాగం అనువణువునా నింపుకుని మనిషిని మనిషి ప్రేమిస్తే ఈ భూమండలం శాంతివనంగా మారుతుందన్న కథా సందేశంతో కొత్త పరిమళం నాటిక ముగుస్తుంది. అదే విధంగా కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన చీకటిపువ్వు నాటిక సమాజంలో ప్రతి ఒక్కరి జీవితంలో ఎదురైన విలువైన సారాంశాన్ని అందించింది. పరిస్థితులకు ఏ మనిషి అతీతం కాదని, అవసరం ఏర్పడో, అవకాశం లేకనో ప్రతి ఒక్కరూ జీవితంలో తప్పులు చేయడం సహజం. చేసిన తప్పులు తెలుసుకుని పశ్చాత్తాపం చెందిన వారిని దూరం పెట్టొద్దని, క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉందని, ప్రాణం పోయిన తరువాత బాధపడే కంటే ఉన్నప్పుడే బాధ్యతగా వ్యవహరించాలంటూ తెలియజెప్పే కథాంశంతో చీకటిపువ్వు నాటిక ముగుస్తుంది. అదేవిధంగా విశాఖపట్నానికి చెందిన సౌజన్య కళాస్రవంతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన దేవరాగం నాటిక బలమైన బంధాన్ని తెలియజెబుతుంది. రక్త సంబంధాలు, పేగు బంధాలు, అనుబంధాల కంటే మనిషి సహజ లక్షణాలు అనేవి వాటన్నింటినీ మించిన బంధం పేగుబంధం. ఈ బంధం విచ్ఛిన్నమైతే తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపమవుతుందని, ఈ బంధం బలంగా ఉంటే వృద్ధాప్యమే ఆ తల్లిదండ్రులకు మధురమైన మలి దశలోని బాల్యం అవుతుందని తెలియజెప్పే కథా సారాంశంతో దేవరాగం నాటిక సమాప్తమైంది.


చీకటిపువ్వులో సన్నివేశం

సాలూరులో కలకలం

- పాకిస్థాన్‌కు అనుకూలంగా పోస్టుపెట్టిన యువకుడు
- సాలూరులో సంచరిస్తున్నట్లు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన వార్త
- తనిఖీలు చేపట్టిన పోలీసులు


తనిఖీలు చేస్తున్న టౌన్ సీఐ అప్పలనాయుడు, పోలీసులు



పాకిస్థాన్‌కు జై కొట్టిన యువకుడు, ఫేస్ బుక్ ఖాతాలో పెట్టిన పోస్టు

సాలూరు: దశాబ్దంన్నర కాలం తరువాత సాలూరు పట్టణంలో జరగనున్న శ్యామలాంబ అమ్మవారి పండగ జాతర ఏర్పాట్లలో అంతా నిమగ్నమై ఉండగా పట్టణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. పాకిస్థాన్‌కు అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టిన అమలాపురానికి చెందిన యువకుడు అక్కడి నుంచి సాలూరు వచ్చాడన్న వార్త పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో అందరూ ఉలిక్కిపడ్డారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణ పరిస్థితుల తరువాత జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో సాలూరులో ఈ వార్త చక్కర్లు కొట్టడంతో, ఇక్కడి వాతావరణం మరింత వేడెక్కింది. అయితే ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పట్టణ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. బస్సులు, కార్లు, ప్రైవేట్ వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తుల వివరాలు ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. పాకిస్థాన్‌కరు అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన యువకుడు సాలూరు వచ్చాడన్న వార్త ఓ వైపు మరో వైపు పోలీసుల తనిఖీలతో పట్టణంలో వాతావరణం వేడెక్కింది. దీనిపై సీఐ అప్పలనాయుడిని వివరణ కోరగా, సదరు యువకుడు సాలూరు వచ్చాడన్న సమాచారంతో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. ఆ యువకుడిని అమలాపురం మండలం కామనగురువు పంచాయతీ పరిధిలోని మిక్సర్ కాలనికి చెందిన పి.రాజుగా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది.

రామభద్రపురంలో గాలింపు

రామభద్రపురం: భారత్–పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అందరూ దేశంపై అభిమానంతో యుద్ధంలో భారత్ నెగ్గాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ క్రమంలో ఆంధ్రాకు చెందిన యువకుడు పాకిస్థాన్‌కు జై కొడుతూ రాజు రెబల్ అనే ఫేస్ బుక్ ఖాతాలో పాకిస్థాన్ జెండా పెట్టి జై పాకిస్థాన్ అని పెట్టిన పోస్టు హల్‌చల్ చేస్తోంది. ఆ యువకుడు రామభద్రపురం ఏరియాలో సంచరిస్తున్నట్లు సెల్‌సిగ్నల్ చూపించడంతో ఈ విషయమై రామభద్రపురం పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఇక్కడి ఎస్సై వి. ప్రసాదరావుతో పాటు పోలీసులు అప్రమత్తమై అనుమానితుడి కోసం గాలిస్తున్నారు.

భారత సైన్యానికి క్రీడాభివందనాలు


ఎస్‌కోటలో ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

భారత్ మాతా కీ జై అంటూ నినాదాలతో ఆదివారం బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. భారత దేశ ప్రజల ధన,మాన ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డుపెట్టి కాపాడుతున్న మన భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి మద్దతుగా క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. శిక్షణ శిబిరం కోచ్, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టరు పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో కేంబ్రిడ్జి స్కూల్ నుంచి దేవీ బొమ్మ, వన్‌వే ట్రాఫిక్ పెద్దవీధి, కాపువీధి మీదుగా భారత్ మాతాకి జై అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు.

శృంగవరపుకోట